ఐదో దశ ఎన్నికల్లో మహిళా అభ్యర్థులు 12 శాతమే

న్యూఢిల్లీ: ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని, 5వ దశ ఎన్నికల్లో మహిళా అభ్యర్థులు 12 శాతమేనని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) సంస్థ పేర్కొన్నది. ఏడీఆర్ నివేదిక ప్రకారం 5వ దశ ఎన్నికల్లో మొత్తం 695 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇందులో మహిళల సంఖ్య 82 మాత్రమే. మొత్తం అభ్యర్థుల్లో 23 శాతం మందిపై క్రిమినల్ కేసులున్నాయి. మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులున్న అభ్యర్థులు 29 శాతం మంది ఉన్నారు. హత్య, హత్యాయత్నం, మహిళలపై నేరాలు, విద్వేష ప్రసంగాలు.. మొదలైన నీరియస్ క్రిమినల్ కేసులున్న అభ్యర్థులు 18 శాతం మంది ఉన్నారు. కోర్టుల్లో దోషులుగా తేలిన ముగ్గురు అభ్యర్థులు కూడా ఎన్నికల్లో నిలబడటం గమనార్హం.

పైసలిస్తే నోరెత్తను

- అదానీ, అంబానీకి వ్యతిరేకంగా మాట్లాడను
- కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత అధిర్ రంజన్
- ఐఎన్‌సీ అంటే 'ఐ నీడ్ కరప్షన్': బీజేపీ

కోల్‌కతా, మే 12: తాను పేదవాడినని, అదానీ తనకు డబ్బులు ఇస్తే పార్లమెంటులో ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడబోనని కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి వ్యాఖ్యానించారు. ఒక టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు వివాదంగా మారాయి. కాంగ్రెస్ నేతలకు టెంపోల్లో డబ్బు వచ్చిందని మోదీ ఆరోపిస్తున్నారు, ఆ డబ్బు ఎక్కడ పెట్టారు ? అని విలేఖరి ప్రశ్నించగా.. 'డబ్బులు ఎక్కడ ఉన్నాయి. నేను దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నాను. నాకు చాలా డబ్బులు కావాలి. నేను పేదవాడినని, ఎన్నికల్లో పోటీకి నా దగ్గర డబ్బులు లేవని నేను బహిరంగంగా చెప్తున్నా. ఈ రోజుల్లో డబ్బులు లేకుండా ఎన్నికల్లో పోటీ చేయడం చాలా కష్టంగా మారింది. నాకు టెంపోలో అవసరం లేదు. అదానీ ఒక బ్యాగులో డబ్బులు పంపించినా నాకు సరిపోతాయి.' అని అధిర్ జవాబు ఇచ్చారు. 'మీరు పార్లమెంటులో వారికి వ్యతిరేకంగా మాట్లాడతారు కదా ?' అని విలేఖరి ప్రశ్నించగా.. 'అవును, వాళ్లు మాకు డబ్బులు పంపించరు కాబట్టే మాట్లాడతా. వాళ్లు పంపిస్తే సైలెంట్ అవుతా.' అని చెప్పారు. 'అంటే, మీకు డబ్బులు అందితే సైలెంట్ అవుతారని చెప్తున్నారా ?' అని విలేఖరి మళ్లీ ప్రశ్నించగా.. 'ముందు వాళ్లు పంపనివ్వండి' అని అధిర్ జవాబిచ్చారు.

ఇది కాంగ్రెస్ మామూళ్ల వసూళ్ల పద్ధతి: బీజేపీ

అధిర్ రంజన్ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి మామూళ్ల వసూలు పద్ధతిని అధిర్ బహిర్గతం చేశారని బీజేపీ అధికార ప్రతినిధి షెహ్‌జాద్ పూనావాలా ట్వీట్ చేశారు. డబ్బు సంచులు అందితే పార్లమెంటులో ఎలాంటి అంశంపైనైనా మాట్లాడకుండా ఉంటామని అధిర్ రంజన్ బాహాటంగా చెప్తున్నారని, డబ్బులు అందకపోతే గలాటా సృష్టిస్తారని పేర్కొన్నారు. అంబానీ, అదానీ గురించి రాహుల్ గాంధీ ఇప్పుడు మాట్లాడటం లేదని అన్నారు. ఇలాంటి పనులు చేసే యూపీఏ హయాంలో కాంగ్రెస్ రూ.12 లక్షల కోట్లు సంపాదించిందన్నారు. ఐఎన్‌సీ అంటే 'ఐ నీడ్ కరప్షన్' అని అభివర్ణించారు. అంబానీ, అదానీ గురించి రాహుల్ గాంధీ మాట్లాడకపోవడాన్ని మోదీ ఎన్నికల ప్రచారంలో ప్రస్తావిస్తూ, టెంపోల నిండా రాహుల్‌గాంధీకి డబ్బులు అందాయని ఆరోపించారు.

బుల్డోజర్ పాలసీ సరికాదు

సొంత సర్కారుకు బీజేపీ ఎంపీ ఝలక్

కైసర్‌గంజ్: యూపీలో బీజేపీ సర్కారు అమలు చేస్తున్న బుల్డోజర్ పాలసీని సొంత పార్టీ ఎంపీ వ్యతిరేకించారు. బుల్డోజర్ కూల్చివేతలకు తాను వ్యతిరేకమని, ఒక ఇంటిని నిర్మించడం చాలా కష్టతరమని బీజేపీ ఎంపీ, మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ శరణ్ పేర్కొన్నారు. గోండు జిల్లా కైసర్‌గంజ్‌లో తన స్థానంలో బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన కుమారుడు కరణ్ భూషణ్ సింగ్‌కు మద్దతుగా ఆయన ఆదివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుల్డోజర్ పాలసీకి తాను వ్యతిరేకమని బహిరంగంగా ప్రకటిస్తున్నానన్నారు.

జార్ఖండ్ జై కొట్టేదెవరికి?

- గత రెండు ఎన్నికల్లో 14లో 12 సీట్లు బీజేపీకే
- ఈసారి గట్టి పోటీ ఇస్తున్న జేఎంఎం – కాంగ్రెస్
- కలిసొస్తున్న హేమంత్ సొరేన్ అరెస్టు సానుభూతి
- 5 ఎస్టీ రిజర్వుడ్ స్థానాల్లో బీజేపీకి ఇబ్బందులే
- కాంగ్రెస్, జేఎంఎంపై అవినీతి ఆరోపణలే బీజేపీ బలం



రాంచి, మే 12: గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఏకపక్షంగా అండగా నిలిచిన రాష్ట్రాల్లో జార్ఖండ్ ఒకటి. రెండుసార్లూ ఇక్కడ బీజేపీకి అనుకూలంగా వార్ వన్‌సైడ్ అన్నట్టుగా ఎన్నికల ఫలితాలు వచ్చాయి. 2014, 2019 ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 14 స్థానాల్లో బీజేపీ 12 గెలుచుకుంది. జేఎంఎం, కాంగ్రెస్‌తో కూడిన యూపీఏ కేవలం రెండు స్థానాలకే పరిమితం అయ్యింది. ఈసారి కూడా జార్ఖండ్‌లో గత ఎన్నికల ఫలితాలనే రిపీట్ చేయాలని బీజేపీ పట్టుదలగా ఉంది. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం ఇచ్చిన స్ఫైర్యంతో బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లోనూ బ్రేకులు వేసేందుకు ఇండియా కూటమి సిద్ధమైంది. ఇండియా కూటమి ఈసారి ఎక్కువగా ఆశలు పెట్టుకున్న రాష్ట్రాల్లో జార్ఖండ్ ముందువరుసలో ఉంది. రాష్ట్రంలో మెజారిటీ సీట్లు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నది. మే 13, 20, 25, జూన్ 1న నాలుగు దశల్లో జార్ఖండ్‌లోని 14 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

అన్ని స్థానాల్లో ద్విముఖ పోరు

రాష్ట్రంలోని మొత్తం 14 స్థానాల్లో ఎన్డీఏ, ఇండియా కూటమి మధ్య ద్విముఖ పోరు నెలకొన్నది. ఆల్ జార్ఖండ్ స్టూడెంట్ యూనియన్(ఏజేఎస్‌యూ)తో కలిసి ఎన్డీఏ కూటమిగా బీజేపీ పోటీ చేస్తున్నది. బీజేపీ 13 స్థానాల్లో, ఏజేఎస్‌యూ ఒక స్థానంలో పోటీ చేస్తున్నాయి. ఇక, మరోవైపు కాంగ్రెస్, జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం), సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, రాష్ట్రీయ జనతా దళ్(ఆర్జేడీ) కలిసి ఇండియా కూటమిగా బరిలో నిలిచాయి. కాంగ్రెస్ ఏడు స్థానాల్లో, జేఎంఎం ఐదు స్థానాల్లో పోటీ చేస్తుండగా, సీపీఐ(ఎంఎల్)ఎల్‌కు ఒక స్థానం, ఆర్జేడీకి ఒక స్థానం కేటాయించారు. ఇండియా కూటమిలో సీట్ల పంపిణీ కుదరక సీపీఐ, సీపీఎం విడిగా పోటీ చేస్తున్నాయి. సీపీఐ నాలుగు సీట్లలో, సీపీఎం ఒక స్థానంలో బరిలో ఉన్నాయి.

సీట్లు తగ్గొద్దని బీజేపీ వంతం

ఇండియా కూటమి నేతలపై అవినీతి ఆరోపణలు, ప్రధాని మోదీ ఇమేజ్‌ను బీజేపీ నమ్ముకున్నది. జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరేన్ అవినీతి ఆరోపణలతో అరెస్టు కావడం, కాంగ్రెస్ మంత్రి ఆలంగిర్ ఆలం వ్యక్తిగత కార్యదర్శి ఇంట్లో కోట్లలో నగదు బయటపడటం వంటి అంశాలను ఎన్నికల ప్రచారంలో బీజేపీ ప్రధానంగా ప్రస్తావిస్తున్నది. అయితే, రాష్ట్ర బీజేపీ నేతల మధ్య విభేదాలు, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ మాజీ ఎంపీ గీతా కోడాకు టికెట్ ఇవ్వడం, యశ్వంత్ సిన్హా కుమారుడు జయంత్ సిన్హాను పోటీ నుంచి తప్పించడం బీజేపీకి ఇబ్బందికరంగా మారాయి.

రెండు స్థానాలపై ఇండియా కూటమి ఆశలు

రెండంకెల సీట్లపై ఆశలు పెట్టుకున్న ఇండియా కూటమి మాజీ సీఎం హేమంత్ సొరేన్ అరెస్టు సానుభూతి తమకు ఓట్లు కురిపిస్తుందని భావిస్తున్నది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే వరుసగా ప్రారంభించిన సంక్షేమ పథకాలు కూడా కలిసొస్తాయని నమ్ముతున్నది. అయితే, కూటమిని ముందుండి నడిపించాల్సిన హేమంత్ సొరేన్ జైలులో ఉండటం, మాజీ సీఎం మధు కోడా భార్య, కాంగ్రెస్ ఒక్కగానొక్క ఎంపీ గీతా కోడా బీజేపీలోకి వెళ్లిపోవడం మైనస్‌గా మారింది.

ఎస్టీ రిజర్వుడ్ స్థానాల్లో బీజేపీకి దెబ్బ?

జార్ఖండ్‌లో ఐదు ఎస్టీ రిజర్వుడ్ స్థానాలున్నాయి. వీటిపైనే ఇప్పుడు అందరి దృష్టి నెలకొన్నది. గత ఎన్నికల్లో వీటిల్లో యూపీఏ రెండు గెలుచుకుంది. మిగతా మూడు ఎన్డీఏ గెలిచినా అతి తక్కువ మెజారిటీలు మాత్రమే సాధించింది. ఈసారి ఎస్టీ రిజర్వుడ్ స్థానాలపై ఇండియా కూటమి కూడా గంపెడాశలు పెట్టుకుంది. ముఖ్యంగా గిరిజనుడైన హేమంత్ సొరేన్‌ను బీజేపీ అక్రమంగా అరెస్టు చేయించిందనే సానుభూతితో గిరిజనులు ఇండియా కూటమి వైపే ఉంటారని భావిస్తున్నది. గత రెండు ఎన్నికలకు భిన్నంగా ఈసారి రెండు కూటముల మధ్య హోరాహోరీ తప్పదని, సాధించబోయే సీట్ల సంఖ్య కూడా ఇలాగే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

'75 ఏండ్ల' రూల్ అద్వానీకేనా?

ప్రధాని మోదీకి వర్తించదా: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, మే 12: బీజేపీలో మోదీ తీసుకొచ్చిన '75 ఏండ్ల' నిబంధన అనేది కేవలం ఎల్‌కే అద్వానీ వంటి నేతలకేనా, మోదీకి వర్తించదా? అని ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఈ నిబంధనను తాను పాటిస్తారా? లేదా? అనేదానిపై మోదీ ఇప్పటి వరకు ఒక్క ప్రకటన కూడా చేయలేదని, దీనిపై ఆయన స్పష్టత ఇవ్వాలని ఆదివారం డిమాండ్ చేశారు. 75 ఏండ్ల నిబంధన మోదీకి వర్తించదంటూ తన వ్యాఖ్యలను ఖండిస్తున్న బీజేపీ నేతలు.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే, యూపీలో సీఎం యోగిని తొలగిస్తారని తాను చేసిన వ్యాఖ్యలను ధ్రువీకరించారని కేజ్రీవాల్ అన్నారు. తనను అరెస్టు చేసిన తర్వాత ఢిల్లీ, పంజాబ్‌లలో ఆప్ ప్రభుత్వాలను కూల్చాలని బీజేపీ కుట్రలు చేసిందని, అయితే అవి ఫలించలేదని కేజ్రీవాల్ అన్నారు.

10 హామీలు ప్రకటించిన కేజ్రీవాల్

మరోవైపు ఎన్నికల నేపథ్యంలో 'కేజ్రీవాల్‌కీ గ్యారెంటీ' పేరుతో 10 హామీలను విడుదల చేశారు. 24 గంటల విద్యుత్తు సరఫరా, నాణ్యమైన విద్య, వైద్య సదుపాయాలు, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు, పంటలకు కనీస మద్దతు ధర, అగ్నివీర్ స్కీమ్ రద్దు తదితర హామీలను నెరవేరుస్తామని ఆయన పేర్కొన్నారు. ఆప్ గెలిస్తే మళ్లీ తాను జైలుకు వెళ్లాల్సిన అవసరం రాదన్నారు.

జార్ఖండ్ కాంగ్రెస్ మంత్రి ఆలంకు ఈడీ సమన్లు

నోట్లకట్టల స్వాధీనం కేసులో విచారణకు పిలుపు

రాంచి, మే 12: జార్ఖండ్ మంత్రి, కాంగ్రెస్ నేత ఆలంగిర్ ఆలంకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నోటీసులు జారీ చేసింది. మనీ లాండరింగ్ కేసులో మే 14న విచారణకు హాజరుకావాలని పేర్కొన్నది. ఓ ఫ్లాట్‌లో రూ.32 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్న కేసులో గత వారం ఆలం వ్యక్తిగత కార్యదర్శి సంజీవ్ కుమార్ లాల్(52)ను, పనిమనిషి జహంగిర్ ఆలం(42)ను ఈడీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. కొందరు వ్యక్తులకు కమీషన్లు ఇచ్చేందుకు ఈ డబ్బులను సంజీవ్ కుమార్ లాల్ వసూలు చేశారని ఈడీ ఆరోపిస్తున్నది. కాగా, సంజీవ్ కుమార్ లాల్ వ్యవహారాలతో తనకు సంబంధం లేదని ఆలంగిర్ పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు రాహుల్ వయసు కన్నా తక్కువ సీట్లే: మోదీ

కోల్‌కతా: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చే సీట్లపై జోస్యం చెప్పారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ (53) వయసు కన్నా తక్కువ స్థానాలే వస్తాయని తెలిపారు. అయితే ఆయన రాహుల్ పేరును నేరుగా ప్రస్తావించకుండా, 'షెహజాదా' అని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఉత్తర 24 పరగణాల జిల్లా, బారక్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ, టీఎంసీ పాలనలో హిందువులు ద్వితీయ శ్రేణి పౌరులుగా మారిపోయారన్నారు. మోదీ ఉన్నంత వరకు పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను ఎవరూ రద్దు చేయలేరన్నారు.

మీరేమైనా ప్రధాని అభ్యర్థా?

రాహుల్‌ను ఎద్దేవా చేసిన స్మృతి

న్యూఢిల్లీ, మే 12: కీలకమైన ఎన్నికల అంశాలపై ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు తాను సిద్ధమేనని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అంగీకరించడాన్ని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ తప్పుపడుతూ మీరు ఇండియా కూటమికి ప్రధాని అభ్యర్థా? అని ఎద్దేవా చేశారు. చారిత్రాత్మకంగా కాంగ్రెస్‌కు ఎంతో బలం ఉన్న అమేథీలో పోటీ చేయడానికి భయపడిన రాహుల్.. ప్రధాని లాంటి వ్యక్తితో పోటీపడటంలో గల సామర్థ్యాన్ని ఆమె ప్రశ్నించారు. ఎంతో పటిష్ఠంగా భావించే రాజకోట లాంటి అమేథీలో పోటీ చేయడానికి ధైర్యం లేని వ్యక్తి మొదట తన ప్రగల్భాలు మానుకోవాలని,తర్వాతే ప్రధాని మోదీ స్థాయి వ్యక్తులతో చర్చకు దిగాలని అన్నారు.

మా కార్యకర్తల అరెస్టులు ఆపండి

ఈసీకి ఎన్‌సీ, పీడీపీ మొర

శ్రీనగర్: తమ కార్యకర్తలపై వేధింపులు, అక్రమ అరెస్టులను ఆపాలని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), పీడీపీ పార్టీలు ఎన్నికల కమిషన్ (ఈసీ)ని కోరాయి. జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్ లోక్‌సభ నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ జరుగుతుంది. తమ పార్టీకి గట్టి పట్టు ఉన్న ప్రాంతాల్లో తక్కువ పోలింగ్ జరిగే విధంగా ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి ప్రయత్నిస్తున్నారని పీడీపీ అభ్యర్థి వహీద్ పర, కేంద్రం నియంతలా వ్యవహరిస్తున్నదని పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ ఆరోపించారు.

ఢిల్లీలో మరోసారి బాంబు బెదిరింపుల కలకలం

న్యూఢిల్లీ, మే 10: ఢిల్లీలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. ఢిల్లీ ఎయిర్‌పోర్టు తోపాటు నగరంలోని 8 దవాఖానలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌ను మోహరించారు. ఇప్పటివరకు ఎలాంటి బాంబులు దొరకలేదని చెప్పారు. గత నెల 30న కూడా కొన్ని దవాఖానలకు, ఈ నెల 1న ఢిల్లీలోని వంద స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే.

50 శాతానికిపైగా ఓట్లు వస్తేనే నోటా ప్రభావం

మాజీ సీఈసీ ఓపీ రావత్

ఇండోర్: ఈవీఎంలలోని నోటా బటన్ కేవలం లాంఛనప్రాయమైనదని మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రావత్ చెప్పారు. ఇండోర్ లోక్‌సభ స్థానంలో నోటాకు ఓటు వేయాలని కాంగ్రెస్ ప్రచారం చేస్తున్న నేపథ్యంలో రావత్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, ఏదైనా స్థానంలో నోటాకు 50 శాతానికి పైగా ఓట్లు వచ్చినపుడు మాత్రమే, ఎన్నికల ఫలితాల్లో దానికి చట్టబద్ధమైన ప్రభావం ఉండేలా చేయడంపై ఆలోచించవచ్చునని తెలిపారు. 100 ఓట్లలో 99 ఓట్లు నోటాకు, కేవలం ఒక ఓటు మాత్రమే అభ్యర్థికి పడినపుడు సైతం ఆ అభ్యర్థే విజేత అవుతారన్నారు. నేర చరిత్ర కలవారిని, ఇతర అనర్హులను తాము ఓటు వేయడానికి పరిగణనలోకి తీసుకోబోమని రాజకీయ పార్టీలకు చెప్పడానికి ఏదైనా స్థానంలో 50 శాతానికి పైగా ఓట్లు వేయాలన్నారు. దీనివల్ల పార్లమెంటు, ఎన్నికల కమిషన్‌లపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. అప్పుడు మాత్రమే ఎన్నికల ఫలితాలపై నోటా ప్రభావం ఉండే విధంగా చట్టాలను సవరించడం గురించి అవి ఆలోచించవలసిన పరిస్థితి వస్తుందని చెప్పారు.

నేడే నాలుగో దశ

- తెలంగాణ, ఏపీ సహా 10 రాష్ట్రాల్లోని 96 లోక్‌సభ స్థానాలకు పోలింగ్
- బరిలో 1,717 మంది అభ్యర్థులు
- ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలూ నేడే

న్యూఢిల్లీ, మే 12: లోక్‌సభ ఎన్నికల నాలుగో దశకు రంగం సిద్ధమైంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 10 రాష్ట్రాలు/యూటీల్లోని 96 లోక్‌సభ నియోజకవర్గాలకు సోమవారం పోలింగ్ జరుగనున్నది. వీటితోపాటుగా ఏపీలోని మొత్తం 175 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతగా, అదేవిధంగా ఒడిశాలో అసెంబ్లీకి తొలి దశలో భాగంగా 28 స్థానాల్లో పోలింగ్ జరుగుతుంది. తెలంగాణలోని మొత్తం 17, ఏపీలోని 25 స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు జరుగుతున్నాయి. యూపీలో 13, బీహార్-5, జార్ఖండ్ 4, మధ్యప్రదేశ్-8, మహారాష్ట్ర-11, ఒడిశా-4, పశ్చిమబెంగాల్-8, జమ్ముకశ్మీర్‌లో ఒక్క స్థానం చొప్పున సోమవారం పోలింగ్ జరుగున్నది. 96 లోక్‌సభ స్థానాల్లో మొత్తం 1,717 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకొంటున్నారు. 1.92 లక్షల పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. దాదాపు 17.70 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో 8.73 కోట్ల మంది మహిళలు ఉన్నారు.

బరిలో పలువురు ప్రముఖులు

ఈ లోక్‌సభ ఎన్నికల విడతలో పలువురు ప్రముఖులు బరిలో ఉన్నారు. సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ యూపీలోని కన్నౌజ్ నుంచి పోటీ చేస్తున్నారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్, టీఎంసీ ఫైర్ బ్రాండ్ మహువా మొయిత్రా, కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి, మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్, నిత్యానంద్ రాయ్, పంకజ ముండే, తదితర నేతలు భవితవ్యం ఈ దశ ఎన్నికల్లో తేలనున్నది. లఖింపూర్ హింసాకాండలో నిందితుడైన అశిష్ మిశ్రా తండ్రి, కేంద్ర మంత్రి అజయ్ కుమార్ మిశ్రా తిరిగి అదే స్థానం నుంచి పోటీచేస్తున్నారు. కాగా, 543 సీట్లు ఉండే లోక్‌సభలో ఇప్పటి వరకు జరిగిన మూడు దశల ఎన్నికల్లో 283 స్థానాల్లో(52 శాతం) పోలింగ్ పూర్తయింది.

మోదీ 'ఆయుష్మాన్' మాకొద్దు

- నిధులు కేటాయించట్లే.. చెల్లింపులు జరపట్లే
- కేంద్రం-రాష్ట్రాల గొడవతో నష్టపోతున్నాం
- పీఎంజేఏవై స్కీమ్ నుంచి బయటకొస్తాం
- కేంద్రానికి ప్రైవేటు దవాఖానల హెచ్చరిక
- ప్రచార ఆర్భాటమే తప్ప, పేదల ఆరోగ్యం బీజేపీ సర్కారుకు పట్టదంటూ నెట్టింట కామెంట్లు
- ఆయుష్మాన్‌లో అక్రమాలు.. గతంలో కాగ్ వెల్లడి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలందరికీ ఉచిత వైద్యం అందించాలన్న లక్ష్యంతో 2018లో కేంద్రంలోని బీజేపీ సర్కారు ఆర్భాటంగా తీసుకొచ్చిన 'ఆయుష్మాన్ భారత్ (ఏబీ-పీఎంజేఏవై)' పథకం నిర్వీర్యమౌతున్నది. ఇప్పటికే ఈ స్కీమ్‌లో రూ. కోట్ల మేర అక్రమాలు జరిగాయంటూ కాగ్ బయటపెట్టగా, తాజాగా ఈ స్కీమ్ పరిధి నుంచి బయటకు వస్తామని ప్రైవేటు దవాఖానలు కేంద్రాన్ని హెచ్చరించాయి. పథకానికి అవసరమైన నిధుల కేటాయింపు, బిల్లుల విడుదలలో జాప్యంతో తాము నష్టపోతున్నామని, దీంతో పథకం నుంచి బయటకు రావాలని నిర్ణయించుకొన్నట్టు పేర్కొన్నాయి. ఈ మేరకు మే 1న జరిగిన కేంద్ర ఆరోగ్య శాఖ, నీతిఆయోగ్ సమీక్షా సమావేశంలో ఆయా దవాఖానల ప్రతినిధులు తేల్చిచెప్పారు. ఆయుష్మాన్ స్కీమ్ అమలుకు అవసరమైన నిధులను 60:40 నిష్పత్తిలో కేంద్రం, రాష్ట్రాలు భరించాల్సి ఉండగా, కొన్ని రాష్ట్రాలు చెల్లింపులు జరుపట్లేదని అసోసియేషన్ ఆఫ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ ఆఫ్ ఇండియా (ఏహెచ్‌పీఐ) డైరెక్టర్ జనరల్ గిరిధర్ గ్యానీ తెలిపారు. కొత్త లబ్ధిదారులు పథకంలో చేరితే వారికయ్యే ఖర్చు మొత్తాన్ని రాష్ట్రాలే భరించాలని కేంద్రం నిబంధనలు పెట్టిందని గుర్తుచేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు పెండింగ్ బిల్లులను విడుదల చేయట్లేదని తెలిపారు. వెరసి కేంద్రం-రాష్ట్రాల మధ్య గొడవతో తాము నష్టపోతున్నట్టు ప్రైవేటు దవాఖానల ప్రతినిధులు వాపోతున్నారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించకుంటే ఈ స్కీమ్‌ను తమ దవాఖానల్లో అమలు చేయబోమని తేల్చిచెప్పారు. ప్రచార ఆర్భాటమే తప్ప, బీజేపీ సర్కారుకు పేదల ఆరోగ్యం పట్టదంటూ సోషల్‌మీడియాలో పలువురు కామెంట్లు పెడుతున్నారు.

శవాలకు చికిత్స.. బిల్లుల సృష్టి

ఆయుష్మాన్ భారత్ స్కీమ్ అమలులో చాలా అక్రమాలు జరిగాయని గత ఆగస్టులో కాగ్ నివేదిక బయటపెట్టింది. ఒకే ఫోన్ నంబర్‌పై 7.50 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయని, అప్పటికే మరణించిన 89 వేల మంది పేర్లను రికార్డుల్లోకి ఎక్కించి శవాలకు చికిత్స అందించినట్టు నకిలీ బిల్లులు సృష్టించారని నివేదిక కుండబద్దలు కొట్టింది. కనీస సదుపాయాలు, పడకలు కూడా లేని దవాఖానలను కూడా స్కీమ్ పరిధిలోకి చేర్చినట్టు తెలిపింది. మధ్యప్రదేశ్‌లోని ఒక్క దవాఖానలోనే ఈ స్కీమ్ ద్వారా రూ. 200 కోట్లు పక్కదారిపట్టినట్టు వార్తలు రావడం కలకలం సృష్టించింది.

నిరసనల్లో పాల్గొనేందుకు డబ్బులు

సందేశ్‌ఖాలీ నిరసనలపై బీజేపీ నేత వెల్లడి

కోల్‌కతా: దేశాన్ని కుదిపేసిన పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీ ఘటనకు సంబంధించి అధికార టీఎంసీ వారం రోజులుగా విడుదల చేస్తున్న వీడియోలు బీజేపీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తాజాగా, మరో వీడియో వెలుగులోకి వచ్చింది. ఇందులో బీజేపీ సందేశ్‌ఖాలీ మండలాధ్యక్షుడిగా చెప్పుకుంటున్న గంగాధర్ కయాల్ మాట్లాడుతూ సందేశ్‌ఖాలీ ఘటనలో లైంగికదాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న టీఎంసీ స్థానిక నేత సత్రాప్ షాజహాన్ షేక్, ఆయన అనుచరులకు వ్యతిరేకంగా ఆందోళనలో పాల్గొన్న 70 మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఆ వీడియోలో కయాల్ మాట్లాడుతూ 30శాతం మంది మహిళలు ఉండే 50 బూత్‌లలో పంపిణీ చేసేందుకు తమకు రూ. 2.5 లక్షలు అవసరమయ్యాయని పేర్కొన్నారు. ఇక్కడ ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు సంతృప్తికరంగా డబ్బులు ఇచ్చి ఆందోళనలో ముందు ఉంచి పోలీసులతో తలపడేలా చేయాలని ఆయన చెప్పడం వినిపిస్తున్నది.

సందేశ్‌ఖాలీలో ఎన్‌సీడబ్ల్యూ చీఫ్ కుట్ర

సందేశ్‌ఖాలీ ఉదంతంలో జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) చైర్‌పర్సన్ రేఖా శర్మ కుట్ర ఉన్నదని తృణమూల్ ఆరోపించింది. రాజకీయ ప్రయోజనాల కోసం అమాయక మహిళలను బలిపశువులను చేస్తూ క్రిమినల్ కుట్రకు పాల్పడిన రేఖాశర్మ, బీజేపీ నేత పియాలీ దాస్ తదితరులపై చర్యలు తీసుకోవాలని ఈసీకి ఫిర్యాదు చేసింది. వారు ఫోర్జరీ, మోసం, దగా, నేరపూరిత కుట్రకు పాల్పడ్డారని ఆరోపించింది.

అక్రమంగా మెడికల్ సీటు.. ఇప్పడేం చేయలేమన్న కోర్టు

ముంబై, మే12 (నమస్తే తెలంగాణ): తప్పుడు సమాచారంతో పొందిన ఓబీసీ నాన్-క్రీమీలేయర్ సర్టిఫికెట్‌తో ఓ విద్యార్థిని ఎంబీబీఎస్ కోర్సులో చేరారన్న కేసులో బాంబే హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ముజావర్ అనే విద్యార్థిని ఓబీసీ క్యాటగిరిలో 2012-13 బ్యాచ్ ఎంబీబీఎస్ కోర్సులో చేరటాన్ని సవాల్ చేస్తూ ఓ డాక్టర్ రిట్ పిటిషన్ దాఖలు చేశాడు. ఈ కేసుపై విచారించిన డివిజన్ బెంచ్.. జనాభాతో పోల్చితే డాక్టర్ల సంఖ్య తక్కువగా ఉన్న మనదేశంలో ఆమె వైద్య కోర్సుపై అనర్హత విధించటం సరైంది కాదని పేర్కొన్నది. జనరల్ కాటగిరీలో ఆమె అడ్మిషన్ పొందినట్టు చూపాలని తీర్పు చెప్పింది. ఆ మేరకు అదనంగా ఫీజు చెల్లించాలని స్పష్టంచేసింది. విద్యార్థినికి 50